ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీకాకుళం

జిల్లా వార్తలు

సోమవారం 25 ఆగస్టు 2025




స్మార్ట్ రైస్ కార్డులను పరిశీలిస్తున్న డీఎస్‌వో సూర్యప్రకాశరావు

స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీకి సిద్ధం

7లో

కరువు నేలలో సిరులు



మొఖలింగపురం వద్ద వరినాట్లు వేస్తున్న రైతులు (ఫైల్)

- మదనగోపాలసాగరం ఎత్తిపోతల పథకం ద్వారా పుష్కలంగా సాగునీరు
- గతంలో వర్షాలపైనే ఆధారపడి పంటల సాగు

టెక్కలి రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి)

ఒకప్పుడు వర్షం పడితేనే ఆ ప్రాంతంలో పంటలు పండేవి. లేదంటే పంట భూములు బీడుగా కనిపించేవి. గతంలో సాగునీరు అందక.. వర్షాలు పడక తీవ్ర కరువు ఏర్పడి రైతులు వలస బాట పట్టేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. వర్షాలతో సంబంధం లేకుండా మదనగోపాలసాగరం ఎత్తిపోతల పథకం ద్వారా ఆ ప్రాంతానికి సాగునీరు పుష్కలంగా అందుతోంది. దీంతో కరువు నేలలో ప్రస్తుతం పంటలు బాగా పండుతున్నాయని టెక్కలి, నందిగాం మండలాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

టెక్కలి మండల పరిధిలోని 21 గ్రామాలకు, నందిగాం మండల పరిధిలోని ఐదు గ్రామాలకు గతంలో ఎలాంటి సాగునీటి వనరు ఉండేది కాదు. దీంతో రైతులు వర్షాధారంపైనే పంటలు పండించేవారు. కొన్నిసార్లు వర్షాలు పడక తీవ్ర ఇబ్బందులు పడేవారు. 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో మంత్రి అచ్చెన్నాయుడు రైతులకు సాగునీరు అందించటానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా మదనగోపాలసాగరం ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు. రూ.34.38కోట్లు మంజూరు చేసి పనులు పూర్తిచేశారు. వంశధార ప్రధాన ఎడమ కాలువ ద్వారా వచ్చే నీటిని మదనగోపాలసాగరం ఎత్తిపోతల ద్వారా రైతులకు అందించడంతో వారికి సాగునీటి కష్టాలు తీరాయి. ఈ పథకం (మిగతా 7వ పేజీలో..)



మదనగోపాపురం సాగరం ఎత్తిపోతల పథకం



పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న రైతులు (ఫైల్)

రైతులంతా కలసికట్టుగా..

ఎవరో వస్తారు... ఏదో చేస్తారని ఎదురు చూడకుండా రైతులంతా ఒక్కటయ్యారు. రూ.70వేలు ఖర్చు చేసి మదనగోపాలసాగరం ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేపట్టారు. సాగునీటి సమస్యను పరిష్కరించుకున్నారు. ఇటీవల కిట్టాలపాడు సమీపంలో పైపులైన్ పాడవడంతో ఎగువ గ్రామాలకు రైతులకు సాగునీరు అందక ఇబ్బందులు పడ్డారు.

దీంతో రైతులంతా బాధ్యతగా ఒక్కటయ్యారు. ప్రభుత్వంపై భారం పడకుండా మరమ్మతుల కోసం రూ.70 వేలు చందాలు వేసుకున్నారు. నర్సింగపల్లికి చెందిన టీడీపీ నాయకులు పి.షణ్ముఖరావు, దారపు పాపారావు, లచ్చుమయ్య, తిరుపతి ఆధ్వర్యంలో ఇటీవల రెండురోజులు మరమ్మతులు చేపట్టారు. సాగునీటి సమస్య పరిష్కారం కావడంతో ఎగువ ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యం..

గత వైసీపీ ప్రభుత్వం మదనగోపాలసాగరం ఎత్తిపోతల పథకాన్ని నిర్లక్ష్యం చేసింది. ఈ పథకం నిర్వహణకు ఎలాంటి నిధులు మంజూరు చేయలేదు. దీంతో మోటర్లు మరమ్మతులకు గురయ్యాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కూడా చోరీకి గురైంది. దీనివల్ల రైతులకు సాగునీటి కష్టాలు ఏర్పడ్డాయి. వర్షాలపైనే ఆధారపడి పంటలు పండించేవారు. వైసీపీ పాలనలో మూడేళ్లపాటు ఎత్తిపోతల పథకం పనిచేయక రైతులు పంటలు నష్టపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పందించి జిల్లాలో 8 ఎత్తిపోతల పథకాలకు రూ.78లక్షలతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు అమర్చారు. మదనగోపాలసాగరం ఎత్తిపోతలకు రూ.36 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు పూర్తిచేసి, మంత్రి అచ్చెన్నాయుడు మళ్లీ ప్రారంభించారు. పుష్కలంగా సాగునీరు అందుతుండడంతో రైతులు వరినాట్లు వేశారు.

ఆర్థిక ఇబ్బందులతో.. చితికిపోయి

- చేనేత కుటుంబం ఆత్మహత్యాయత్నం
- దంపతుల మృతి
- ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కుమార్తె
- అప్పులతోపాటు ఇతర సమస్యలు కూడా కారణం
- అంపోలులో విషాదం

గార రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వారిది చేనేత కుటుంబం. కూలికి వెళ్తే కానీ పూట గడవని పరిస్థితి. ఇంటర్ చదువుతున్న కుమార్తె, అంధుడైన భర్త ఉండడంతో ఆ ఇల్లాలే పనికి వెళ్తూ ఆ వచ్చిన కూలి డబ్బులతో కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. ఇంతలోనే వృద్ధురాలైన అత్త మృతి చెందింది. కర్మకాండలు జరిపించేందుకు చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో అప్పు చేయక తప్పలేదు. ఇవన్నీ ఆ కుటుంబాన్ని ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టేశాయి. దీంతో ఆ కుటుంబం ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. భార్యాభర్త మృతి చెందగా, కుమార్తె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటన గార మండలం అంపోలులో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థుల వివరాల మేరకు.. కొల్లి అప్పారావు(45), కొల్లి లలిత(42) దంపతులు. వీరికి ఇంటర్ చదువుతున్న కుమార్తె దేవి ఉంది. అప్పారావు ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేసేవాడు. ఆయనకు కళ్లు సరిగ్గా కనబడవు. అంధత్వ సమస్య పెరిగిపోవడంతో ఉద్యోగం మానేశాడు. దీంతో కుటుంబ పోషణ (మిగతా 8వ పేజీలో..)





అప్పారావు, లలిత మృతదేహాలను పరిశీలిస్తున్న సీఐ పైడపునాయుడు, స్థానికులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దేవిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శంకర్

దేవిని దత్తత తీసుకుంటా..

- అసత్య ప్రచారాలు తగదు: ఎమ్మెల్యే శంకర్
- రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన కలెక్టర్

గార రూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను కోల్పోయి ఒంటరైన దేవిని దత్తత తీసుకుంటానని ఎమ్మెల్యే శంకర్ ప్రకటించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న దేవిని ఆదివారం ఆయన పరామర్శించారు. ఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా ఆదుకుంటామని, ఎటువంటి ఒత్తిడికి లోనుకావద్దని దేవికి భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 'దేవిని దత్తత తీసుకుని ఆమె భవిష్యత్‌ను బంగారంలా చక్కదిద్దుతా. పీ-4లో భాగంగా బంగారు కుటుంబంలో చేర్పిస్తా. చదివినంత కాలం చదివించి.. పెళ్లి చేసే వరకూ ఆ విద్యార్థి బాగోగులు ప్రభుత్వం చూసుకుంటుంది. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రత్యేక నిధుల నుంచి రూ.2లక్షల ఎక్స్‌గ్రేషియా ఆ కుటుంబానికి ప్రకటించారు. అంతేకాకుండా ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చర్యలు తీసుకుంటాం. విషయం తెలుసుకోకుండా కొంతమంది వైసీపీ నాయకులు, కొన్ని టీవీ చానళ్లు అసత్య ప్రచారాలు చేయడం తగదు. రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం సరికాదు. బాధిత కుటుంబానికి.. వేరే ప్రాంతంలో ఉద్యోగం చేసుకుని నివశిస్తున్న రెండో సోదరుడి మధ్య ఇంటికి సంబంధించి తగాదా నడుస్తోంది. ఈ విషయాన్ని మృతుల కుమార్తె దేవి, గ్రామ పెద్దలు స్వయంగా తెలియజేశారు. ఒకపక్క ఆర్థిక ఇబ్బందులు, రెండోపక్క సొంత ఇల్లు కూడా లేదని మనస్తాపానికి గురై ఆ దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఇప్పటికైనా అసత్యప్రచారాలు మానుకోవాలి' అని సూచించారు. ఆయన వెంట గొండు వెంకటరమణమూర్తి, ఆప్కో చైర్మన్ కాశిని ప్రసాదరావు, బట్టా సురేష్ తదితరులు ఉన్నారు.



రేపే 'బుజ్జాయి చేతిలో బొజ్జగణపయ్య'

- 'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్' ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల తయారీ
- 8,9,10 తరగతుల విద్యార్థులకు ఆహ్వానం
- ప్రవేశం ఉచితం

శ్రీకాకుళం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి సందర్భంగా పర్యావరణహితంగా పండగ జరుపుకొనేలా.. విద్యార్థులను భాగస్వాములను చేసేలా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్'.. మంగళవారం 'బుజ్జాయి చేతిలో బొజ్జగణపయ్య' కార్యక్రమాన్ని నిర్వహించనుంది. శ్రీకాకుళం నగరం అరసవల్లి రోడ్‌లో ఎల్.ఎన్ గ్రీన్స్ ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది. విద్యార్థులకు శిక్షణ ఇచ్చి.. మట్టి వినాయక ప్రతిమలను తయారీ చేయించనుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు 8, 9, 10 తరగతుల విద్యార్థి, విద్యార్థులను ఆహ్వానిస్తోంది. విద్యార్థులు ఎటువంటి రుసుము లేకుండా ఉచితంగా పాల్గొనవచ్చు. తయారుచేసిన మట్టిప్రతిమలతోపాటు ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేయనుంది. ఆసక్తిగల విద్యార్థులు పేర్ల రిజిస్ట్రేషన్ కోసం 9985411066 నెంబర్‌కు సంప్రదించాలి. మంగళవారం ఉదయం 9.30గంటలకు ప్రాంగణానికి చేరుకోవాలి. ఖాళీ వాటర్ బాటిల్, చిన్నపాటి వస్త్రం వెంట తెచ్చుకోవాలి. ఈ కార్యక్రమానికి 'రవితేజ డెవలపర్స్' ప్రధాన స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది.

ఉపాధ్యాయుల భర్తీకి సన్నద్ధం

- మెరిట్ ఆధారంగా ఎంపికకు కసరత్తు ప్రారంభం
- డీఎస్సీ రోస్టర్ పాయింట్లు విడుదల

నరసన్నపేట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో భాగంగా ఉపాధ్యాయుల నియామక ప్రక్రియలో రోస్టర్ రిజర్వేషన్ల పాయింట్లను రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసింది. మెరిట్ ఆధారంగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి కసరత్తు ప్రారంభించింది. ఉమ్మడి జిల్లాలో అన్ని యాజమాన్య పాఠశాలలకు చెందిన సబ్జెక్టులు, సామాజిక వర్గాలవారీగా కేటాయించిన పోస్టుల వివరాలను వెల్లడించింది. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఆర్డినెన్స్ ఆమోదం పొందడంతో ఆ వర్గాన్ని గ్రూప్ 2, 3గా విభజించి పాయింట్లు కేటాయించింది. జిల్లాలో మొత్తం భర్తీ చేయనున్న పోస్టులు 543. ఇందులో 407 పోస్టులు జిల్లా, మండల పరిషత్‌లో ఉన్నాయి. 51 పోస్టులు పురపాలకసంఘ పరిధిలో ఉండగా, 85పోస్టులు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు కేటాయించారు. జిల్లాపరిషత్, మండల, పురపాలక సంఘం పరిధిలోని 458 పోస్టులకు సామాజిక వర్గాలవారీగా రిజర్వేషన్లు కల్పించారు. వీటిలో 184 జనరల్ విభాగం కాగా, బీసీ ఏ- 35, బీసీ బీ- 41, బీసీ సీ- 6, బీసీ డీ -32, బీసీ ఈ -20, ఎస్సీ గ్రూప్ 1 - 6 పోస్టులు, ఎస్సీ గ్రూప్ 2 - 27, ఎస్సీ గ్రూప్ 3 - 36, ఎస్టీకి -25, (మిగతా 7వ పేజీలో..)



ఎరువుల బ్లాక్‌మార్కెట్‌పై విజిలెన్స్

- మూడు జిల్లాల్లో తనిఖీలు..
- విజయనగరంలో రికార్డులు సక్రమంగా లేవని నిర్ధారణ

శ్రీకాకుళం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఎరువుల బ్లాక్‌మార్కెట్‌పై విజిలెన్స్ అధికారులు నిఘా పెట్టారు. విజిలెన్స్ డీజీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాల మేరకు శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా(విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్) సిబ్బంది ఆదివారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని ఎరువుల దుకాణాల్లో తనిఖీ చేశారు. శ్రీకాకుళం జిల్లాలో ఎనిమిది చోట్ల, విజయనగరం జిల్లాలో 9, పార్వతీపురం మన్యం జిల్లాలో 6 ప్రాంతాల్లో స్థానిక రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. విజయనగరంలో శ్రీ మాతా వెంకటేశ్వరరావు సన్స్ దుకాణంలో రికార్డులు సక్రమంగా లేకపోవడాన్ని గుర్తించారు. దుకాణంలో ఉన్న సుమారు రూ.2.47 లక్షల విలువైన 4.35 టన్నుల కాంప్లెక్స్ ఎరువుల విక్రయం నిలుపుదల చేయాలని సిఫారసు చేశారు. విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాదరావు మాట్లాడుతూ ఎరువుల కృత్రిమ కొరతను సృష్టించి అధిక ధరలకు విక్రయించే వ్యాపారులు, దళారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ సతీష్‌కుమార్, అసిస్టెంట్ జియాలజిస్ట్ సురేష్‌కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎర్రన్నాయుడు, ఎస్‌ఐ రామారావు, రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



నరసన్నపేటలోని ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ సిబ్బంది



అరసవల్లిలో భక్తుల రద్దీ

భక్తులతో ఆదిత్యాలయం కిటకిట

అరసవల్లి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): అరసవల్లిలోని ఆదిత్యాలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ పరిసరాలు, క్యూలైన్లు భక్తులతో రద్దీగా కనిపించాయి. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ చర్యలు తీసుకున్నారు. ఉచిత అన్నప్రసాదం వద్ద ఏర్పాట్లను ఈవో పరిశీలించి.. భక్తులతో మాట్లాడారు. ఆదివారం ఒక్కరోజు ఆదిత్యుడికి రూ.4,91,133 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.2,13,600, విరాళాల రూపంలో రూ.66,458, ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.2,11,075 లభించినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

ఆక్రమణలో కంబిరిగాం శ్మశాన భూములు

స్నేహితుడిపై హత్యాయత్నం

రోడ్లపై చెత్తవేసిన వ్యాపారులకు జరిమానా

8లో

ఈ మార్గంలో ప్రయాణం ప్రమాదకరం

- చిలకపాలెం-పొందూరు రోడ్డులో కూలుతున్న భారీ వృక్షాలు

7లో

ఈ మార్గంలో ప్రయాణం ప్రమాదకరం

● కూలుతున్న భారీ వృక్షాలు

● ఇదీ చిలకపాలెం-పొందూరు రోడ్డులో పరిస్థితి





చిలకపాలెం-పొందూరు మార్గంలో కృష్ణాపురం సమీపంలో కూలేందుకు సిద్ధంగా ఉన్న పురాతన చెట్లు (ఇన్‌సెట్‌లో) భగవాన్‌దాస్‌పేట వద్ద అర్ధరాత్రి కూలిన భారీ వృక్షాన్ని తొలగిస్తున్న దృశ్యం (ఫైల్)

పొందూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): చిలకపాలెం-పొందూరు ప్రధాన రాష్ట్ర రహదారి లో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ద్విచక్ర వాహనాల నుంచి భారీ వాహనాలతో వేలాది మంది ప్రయాణిస్తుంటారు. అయితే ప్రస్తుతం ఈ మార్గంలో ప్రయాణమంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ రోడ్డులో దశాబ్దాల కిందట వేసిన మొక్కలు మహా వృక్షాలుగా తయార య్యాయి. అయితే వీటిలో కొన్ని వృక్షాలు కూలిపోతుండడంతో గంటల తరబడి ట్రాఫిక్ కు అంతరాయం కలుగుతోంది. ఎక్కడ ఏ వృక్షం కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఒకవైపు అడ్డు, అదుపు లేకుండా వేగంగా వచ్చే క్వారీ క్రషర్ వాహనాలు, ఇంకో వైపు సమయపాలన లేకుండా క్వారీ పేలు ళ్లతో రోడ్డు పైకి రాళ్లు వచ్చి పడుతుంటే ఇటీవల ఈ మార్గంలోని భారీ వృక్షాలు ఎండి పోయి కూలి పోతున్నాయి. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల వృక్షాలు, వాటి కొమ్మలు పడడం నిత్యకృత్యంగా మారింది. కొద్దిరోజుల కిందట భగవాన్‌పేట గ్రామం వద్ద వందల ఏళ్ల నాటి భారీ వృక్షం అర్ధరాత్రి సమయంలో కూకటి వేళ్లతో పడిపోయింది. అర్ధరాత్రి కావడంతో వాహనాలు తక్కువగా రాకపోకలు సాగించడంతో పెనుప్రమాదం తప్పింది. ఆర్అండ్‌బీ అధికారులు ఈ వృక్షాన్ని తొలగించే చర్యలు తీసుకున్నారు. అయితే మిగిలిన మార్గంలో ప్రమాదకరంగా ఉన్న చెట్ల వైపు దృష్టి సారించలేదు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పలువురు వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రధాన మార్గంలో ఎండిపోయి ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగించే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ ఏఈ వీటీ రాజు వద్ద 'ఆంధ్ర జ్యోతి' ప్రస్తావించగా చెట్లు, చెట్ల కొమ్మలు రోడ్డుపై పడడం వాస్తవమని, ప్రమాదంగా ఉన్న చెట్లను తొలగించాలని స్థానికుల నుంచి కూడా వినతులు వస్తున్నాయన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, వారి ఆదేశాలతో తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

ఇంటి వద్దకే మట్టి వినాయక ప్రతిమలు

● కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కరుణశ్రీ



మట్టి వినాయక ప్రతిమను అందజేస్తున్న ఈఈ కరుణశ్రీ

శ్రీకాకుళం అర్బన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఇంటి వద్దకే మట్టి వినాయక ప్రతిమలను అందించేందుకు చర్యలు తీసుకున్నామని కాలుష్య నియంత్రణ మండలి ఈఈ బి.కరుణశ్రీ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా నూతన టెక్నాలజీని వినియోగించి మట్టి వినా యక ప్రతిమలను ఇంటి వద్దకే అందించేందుకు కార్యక్ర మం ఇటీవల ప్రారంభించా మన్నారు. రిజిస్ట్రేషన్‌కు క్యూ ఆర్ కోడ్‌ను ఇచ్చి ప్రజలు తమ వివరాలను నమోదు చేసుకోవాలని, వారి ఇంటికే మట్టి వినాయకుల విగ్రహా లను అందజేస్తామన్నారు. ఒకరోజులోనే మూడు వేల మంది పేర్లు నమోదుచేసుకున్నారన్నారు. ఆదివారం వెయ్యి మందికి గుడ్డ సంచితోపాటుగా వినాయక వ్రతకథ పుస్తకం, మట్టి వినాయక ప్రతిమను ఇంటి వద్దకే సిబ్బందితో అందజేశామన్నారు.



మట్టి గణపతిని తయారు చేస్తున్న చిన్నారులు

చిట్టి చేతులతో చిన్ని వినాయకులు

శ్రీకాకుళం కల్చరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జడ్పీ ఎదురు ఏపీహెచ్‌బీ కాలనీలోని షిర్డీసాయి ఆధ్యాత్మిక ధ్యాన మందిరంలో ఆదివారం చిన్నారులకు మట్టి వినాయకుల తయారీ పోటీలను నిర్వహించారు. 3 నుంచి 15 సంవత్సరాల మధ్య ఉన్న సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొని మట్టి వినాయకులను తయారు చేశారు. అనంతరం నిర్వాహకులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు.



పంపిణీకి సిద్ధం చేసిన మట్టి వినాయక విగ్రహాలు

మట్టి వినాయకుల పంపిణీ

శ్రీకాకుళం కల్చరల్ ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మొండేటి వీధిలోని శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో ఆదివారం 1008 మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రతినిధి వేంకటేశ్వరరావు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రతి ఏటా అందజేస్తున్నా^న్నారు.

సినీనటుడు బాలకృష్ణకు మంత్రి అచ్చెన్న శుభాకాంక్షలు

శ్రీకాకుళం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, యూకే గోల్డ్ ఎడిషన్‌లో సినీనటుడు నందమూరి బాలకృష్ణ పేరు నమోదవడం ఆనందంగా ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. యాభై ఏళ్లుగా హీరోగా గుర్తింపు పొందిన బాలకృష్ణ సినిమా జైత్రయాత్రకి అత్యంత గౌరవప్రదమైన ఘనతగా నిలుస్తుందన్నారు. కెరీర్ మొత్తం బాలకృష్ణ తన తండ్రి, లెజెండరీ నందమూరి తారక రామారావు వారసత్వాన్ని శాశ్వతంగా కాపాడుతూ టాలీవుడ్‌లో ఆల్‌రౌండర్ ప్రతిభతో గుర్తింపు పొందారన్నారు. శక్తివంతమైన స్క్రీన్ ప్రెజెన్స్, కళ పట్ల నిబద్ధత బాలకృష్ణ క్రమ శిక్షణ సొంతమని.. ఇదే అన్ని తరాల సినిమా ప్రేమికులను అభిమాన పాత్రులను చేసిందని కొనియాడారు. గత 15 ఏళ్లుగా బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్‌గా వ్యవహరిస్తూ ప్రజాసేవను ఒక ఉదాత్త మిషన్ గా నిరూ పించారని స్పష్టం చేశారు. అందుకే వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో గర్వంగా నిలబడే స్థిరత్వం సంపాదించుకున్నారని పేర్కొంటూ బాలకృష్ణకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

శాశ్వత అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



ఈవోకు డీడీని అందజేస్తున్న దాత

అరసవల్లి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకానికి విశాఖపట్నానికి చెందిన జి. వెంకటనారాయణ రూ.1,00,116 డీడీని అందించారు. ఆదివారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి స్వామిని దర్శించుకున్నారు. తన కుమారుడు సాయి సందీప్ పేరున డీడీని ఈవో కేఎన్‌వీడీవీప్రసాద్‌కు అందజేశారు. దాతకు ఈవో స్వామి జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకర శర్మ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ప్రపంచ జానపద సంబరాలు



కోలాట ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

ఇచ్ఛాపురం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): శ్రీమహంతి సాంస్కృతిక కళాసేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవం, ప్రపంచ జానపద దినోత్సవ సంబరాలను ఆదివారం నిర్వహించారు. కళాసేవా సంస్థ, కళాభారతి కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రోటరీ హాల్‌లో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారుల జానపద కోలాటం, కూచిపూడి, భరత నాట్య ప్రద ర్శన, సంబల్‌పూరి నృత్యం, భూ భాగోతం, కోయిడాన్స్, జాన పద సంప్రదాయ గీతాలాపన చేపట్టారు. కార్యక్రమంలో పలువురు సంస్థ ప్రతినిధులు, కళాకారులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలి

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలని స్టార్ వాకర్స్ క్లబ్ మాజీ గవర్నర్ జి.ఇందిరాప్రసాద్ అన్నారు. స్థానిక పీఎస్ ఎన్ఎం హైస్కూల్ ఆవరణలో ఆదివారం స్పోర్ట్స్ అండర్ గేమ్స్ ఆర్గనైజ్డ్ డిస్ట్రిక్ట్ ఘట్కా, శ్రీకాకుళం అసోసియేషన్ ఆధ్వ ర్యంలో జిల్లాస్థాయి ఘట్కా పోటీలు నిర్వహించారు. ఈ ఘట్కాలో కర్రసాము, కత్తులు వంటి సంప్రదాయ యుద్ధ క్రీడలు ఉంటాయన్నారు. స్టార్ వాకర్స్ సభ్యులు బీవీ రవిశంకర్, గజల్ వాసుదేవాచారి, ఎస్. జోగినాయుడు, టీడీపీ నాయకుడు బలగ శివప్రసాద్, జిల్లా ఘట్కా అసోసియేషన్ అధ్యక్షుడు ఖగేశ్వరరావు, వి. శ్యామసుందరరావుపాల్గొన్నారు.

వైద్య శిబిరం



మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆమదాలవలస, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మెట్టక్కివలస సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పాత ఆమదాలవలసలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు పి.తాతయ్యలు, కె.హేమంత్, పద్మజ, డి.సురేష్, సౌజన్య రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు.సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు, కన్వీనర్ వెంకట కామావధానులు, నరసింహమూర్తి పాల్గొన్నారు.

నేడు స్మార్ట్ కార్డుల పంపిణీ

ఇచ్ఛాపురం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన రేషన్‌స్మార్ట్ కార్డులను సోమవారం పంపిణీ చేయనున్నామని డిప్యూటీ తహసీల్దార్ శ్రీహరి తెలిపారు. పట్టణంలోని 227 ఎఫ్‌పీ షాపు వద్ద పంపిణీ చేస్తామన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలి



ఎంపికలకు హాజరైన క్రీడాకారులతో సంఘం ప్రతినిధులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడాకారులు సత్తా చాటి జిల్లా కీర్తిని ఇనుమడింప జేయాలని రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి సూర శ్రీనివాసరావు అన్నారు. స్థానిక కోడిరామ్మూర్తి స్టేడియంలో ఆదివారం జిల్లా స్థాయి సీనియర్స్ సాఫ్ట్‌బాల్ మహిళా జట్టు ఎంపికలు నిర్వహించారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 30, 31వ తేదీల్లో గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో జరగ నున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలి పారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ జి.రాజు, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి ఎం.సాంబమూర్తి, జిల్లా పీఈటీ, పీడీ సంఘం అధ్యక్షుడు పి. తవిటయ్య, కార్యదర్శి ఎంవీరమణ, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ, అథ్లెటిక్స్ కార్యదర్శి కె.హరిబాబు, ఎం.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నీటిని వృథా చేయొద్దు



అవగాహన కలిగిస్తున్న ప్రిన్సిపాల్ శివప్రసాద్

కంచిలి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): నీటిని వృథా చేయకుండా ఆదా చేయాలని ఎంఎస్ పల్లి ఏపీ మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్.శివప్రసాద్ అన్నారు. ఆదివారం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో ప్లకార్డులు పట్టుకుని నీటి ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటిని పొదుపుగా వినియోగించాలని, వ్యవసాయంలో డ్రిప్, బిందు సేద్య పద్ధతుల ద్వారా నీటిని తక్కువగా ఉపయోగించవచ్చన్నారు. గ్రామంలో వివిధ నమూనాలు ప్రదర్శించి అవగాహన కలిగించారు. కార్యక్రమంలో పీఎంసీ కమిటీ చైర్మన్ ఎన్.కృష్ణారావు, సభ్యులు, అధ్యాపకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కరువు నేలలో సిరులు

(ఐదో పేజీ తరువాయి)

ద్వారా గూడేం, నర్సింగపల్లి, మొఖలింగపురం, రాంపురం, బొడ్డ పాడు, నౌగాం తదితర పంచాయతీల్లోని 3,300 ఎకరాలకు సాగు నీరు పుష్కలంగా అందుతోంది. సుమారు 26 గ్రామాలకు చెందిన 3,340 మంది రైతులకు ప్రయోజనం కలుగుతోంది.

ఆ గ్రామాలకు కూడా..

ఎత్తిపోతల పథకం ద్వారా జగన్నాథపురం, కొల్లివలస, పాత్రపురం, పాలసింగి, గడిమెట్ట గ్రామాలకు సాగునీరు అందడం లేదు. దీనిపై రైతులు ఇటీవల మంత్రి అచ్చెన్నాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో జగన్నా థపురం వరకు పైపులైన్లు వేసి ఆ గ్రామాలకు సాగునీరు అందించేందుకు రూ.3.50కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపినట్లు అధికారులు తెలిపారు.

నాట్లు వేసుకుంటున్నాం..



గతంలో వర్షా లు పడితే పంటలు పండేవి. లేకపోతే కరువుతో అల్లాడేవాళ్లం. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మా ప్రాంతానికి మంచి రోజులు వచ్చాయి. ఇప్పుడు వర్షాలు లేకపోయినా మదనగోపాలసాగరం ఎత్తిపోతలతో సాగు నీరు అందుతోంది. దీంతో వరి నాట్లు వేశాం.

-దారపు, కామేష్, రైతు, నర్సింగపల్లి

ఆనందంగా ఉంది..



నాడు బీడుగా కనిపించే మెట్టు భూముల్లో నేడు వరి పంటలు పండించుకొని బతుకుతున్నాం. చాలా ఆనందంగా ఉంది. గతంలో అప్పు లు చేసి వరినాట్లు వేసినా పండుతుం దనే ఆశ ఉండేది కాదు. ఇప్పుడు ఆ భయం లేదు. ఎత్తిపోతల ద్వారా నీరు వస్తోంది.

-వెంకయ్య, రైతు

ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, కళాశాల సిబ్బంది

శ్రీకాకుళం అర్బన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ అన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల రోడ్డు కాకినాడ శ్రీఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో 'రోడ్డు భద్రత..హెల్మెట్ వినియోగం'పై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డేఅండ్‌నైట్ జంక్షన్ నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధరించాలని పేర్కొంటూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో ఎల్. మోహనరావు, వైస్‌ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, కళాశాల డైరెక్టర్ చక్రవర్తి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీకి సిద్ధం

లావేరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. ఎచ్చెర్ల నియోజకవర్గంలో 92,430 కార్డులు లబ్ధిదారులకు అందించనున్నారు. ఈ మేరకు లావేరులో 21,238, ఎచ్చెర్లలో 27,196, జి.సిగడాంలో 17,381, రణస్థలంలో 27,615 కార్డులు పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు సద రు కార్డులను డీఎస్‌వో జి.సూర్య ప్రకాశరావు ఆదివారం పరిశీలించారు. ఈనెల 25న చినమురపాకలో ఈ కార్డుల పంపిణీని ఎమ్మెల్యే ఎన్ఈఆర్ ప్రారంభిస్తారని తహసీల్దార్ గురుగుబిల్లి శ్రీనివాసరావు తెలిపారు.

ఉపాధ్యాయుల భర్తీకి సన్నద్ధం

(ఐదో పేజీ తరువాయి)

ఈడబ్ల్యూఎస్‌కు -44 పోస్టులు కేటాయించారు.

రోస్టర్ రిజర్వేషన్లు ఇలా..

● స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిషులో 65 పోస్టులకుగాను ఓసీ-26 , బీసీ ఏ- 3, బీసీ బి- 7, బీసీ సి- 1 బీసీ డి-5, బీసీ ఈ-3 కేటాయించారు. ఎస్సీ గ్రూప్ -1లో 1 గ్రూప్- 2లో-3 , గ్రూప్ -3లో 6, ఎస్టీ -4, ఈడబ్ల్యూఎస్‌కు - 6 కేటాయించారు.

● హిందీ విభాగంలో 11 పోస్టులకు ఓసీ- 3, బీసీ ఏ, బీ, డీ, ఈ గ్రూప్‌లతోపాటు ఎస్సీ గ్రూపు 2, 3కి ఒక్కోటి, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్‌కు ఒక్కో పోస్టు కేటాయించారు.

● తెలుగు విభాగంలో 37 పోస్టులకు ఓసీ -14, బీసీ ఏ - 3, బీసీ బీ- 2, బీసీ డీ - 3, బీసీఈ - 2, ఎస్సీ గ్రూప్ 1 -1, గ్రూప్ 2,3 కి రెండు చొప్పున, ఎస్టీ-2, ఈడబ్ల్యూఎస్ -3 పోస్టులు కేటాయించారు. ఒరియాలో 03 పోస్టులకు ఓసీ -2, బీసీ ఏ - 1 కేటాయించారు.

● బయాలజీ విభాగంలో 34 పోస్టులకు ఓసీ- 15, బీసీ ఏ, బీకి మూడేసి చొప్పున, బీసీ డీ -2, బీసీ ఈ -1, ఎస్సీ గ్రూప్ 1- 1, గ్రూప్ 2- 2, గ్రూప్ 3- 2, ఎస్టీ - 2, ఈడబ్ల్యూఎస్ - 3 కేటాయించారు.

● గణితంలో 33పోస్టులకుగాను ఓసీ-13, బీసీ ఏ,సీ,ఈ ఒక్కోటి చొప్పున, బీసీ బీ -3, బీసీ డీ- 2, ఎస్సీ గ్రూప్ 1, 2కి ఒక్కోటి, గ్రూప్ 3కి -4, ఎస్టీ -1, ఈడబ్ల్యూఎస్ -3 కేటాయించారు. ఒరియా గణితంలో ఎస్సీ గ్రూప్ 2, ఈడబ్ల్యూఎస్‌కు ఒక్కోటి చొప్పున కేటాయించారు.

● ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో 81 పోస్టులకు గాను ఓసీ - 34, బీసీ ఏ, బీకి ఏడు చొప్పున, బీసీ సీ- 1, బీసీ డీ - 5, బీసీ ఈ -3, ఎస్సీ గ్రూప్ 1- 1, గ్రూప్ 2- 6, గ్రూపు 3 - 5, ఎస్టీ -5, ఈడబ్ల్యూఎస్ - 7 కేటాయించారు.

● ఫిజిక్స్‌లో 14 పోస్టులకుగాను ఓసీ-4, బీసీ -ఏ, బీ, ఈకి ఒక్కోటి చొప్పున, బీసీ డీ-2, ఎస్సీ గ్రూప్ 2- 1, ఎస్సీ గ్రూప్ 3- 2, ఈడబ్ల్యూఎస్ - 2 కేటాయించారు.

● సోషల్ విభాగంలో 70 పోస్టులకు ఓసీ-28, బీసీ ఏ -5, బీసీ బీ -6, బీసీ సీ -1, బీసీ డీ -4, బీసీ ఈ -3, ఎస్సీ గ్రూప్ 1 -2, ఎస్సీ గ్రూప్ 2 -4, గ్రూప్ 3 -5 , ఎస్టీ -3 , ఈడబ్ల్యూఎస్ -06 కేటాయించారు. ఒరియా మీడియంలో బీసీ ఏ,డీ,ఈకి ఒక్కో పోస్టు కేటాయించారు.

● ఎస్జీటీలో 113 పోస్టులకుగాను ఓపెన్ -38, బీసీ ఏ,బీకి 8 చొప్పున, బీసీ సీ -2, బీసీ డీ- 6, బీసీ ఈ- 4, ఎస్సీ గ్రూప్ 1- 1, ఎస్సీ గ్రూప్ 2- 5, ఎస్సీ గ్రూప్ 3 - 8, ఎస్టీ -5, ఈడబ్ల్యూఎస్ -10 కేటాయించారు. ఒరియా మీడియంలో ఓపెన్ -7, బీసీ ఏ -1, బీసీ బీ -3, బీసీ డీ -1, ఎస్సీ గ్రూప్ 2, 3కి ఒక్కోటి, ఎస్టీ -2, ఈడబ్ల్యూఎస్‌కు -2 పోస్టులు కేటాయించారు.

యువత రక్తదానం

ఆమదాలవలస, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సిక్కోలు చేయూత సేవా సంఘం 8వ వార్షికోత్సవం సందర్భంగా పట్టణంలోని లక్ష్మీనగర్ ఉన్నత పాఠశాలలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ తమ్మినేని రవి మాట్లాడుతూ.. రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా 40 మంది రక్తదానం చేశారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్య క్రమంలో హెచ్ఎం పీవీ రమణమ్మ, సిక్కోలు చేయూత సేవా సంఘం అధ్యక్షుడు గోపి కృష్ణ, కార్యదర్శి వీటీ నాయుడు, గుడ్ల బాబు, ఎస్వీరమణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలిగా శ్యామల

సోంపేట రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సోంపేట మండల టీడీపీ మహిళా అధ్యక్షురాలిగా శ్రీపురుషోత్తం శ్యామలను అధిష్ఠానం నియమించింది. ఆమె మాట్లాడుతూ.. తనను అధ్యక్షురాలిగా నియమించేందుకు సహకరించిన ఎమ్మెల్యే అశోక్, మాజీ మంత్రి శివాజీ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

మెహర్‌బాబా మందిర వార్షికోత్సవం

శ్రీకాకుళం కల్చరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కత్తెరవీధిలో ఉన్న మెహ ర్‌బాబా ఆరా ధన మందిరం 64వ వార్షి కోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. నగర సంకీర్తన, సప్తవర్ణ పతాక ఆవిష్కరణ తదితర కార్యక్రమాలు చేపట్టారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఎచ్చెర్ల, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కుశాలపురం బైపాస్ రోడ్డుకు సమీపంలో ఈనెల 17న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న లక్ష్మణ్ (65) శనివారం రాత్రి మృతి చెందాడని ఎస్‌ఐ వి.సందీప్ కుమార్ తెలిపారు. ప్లాస్టిక్ బాటిల్స్ సేకరిస్తుండే లక్ష్మణ్ ఆ రోజు రాత్రి రోడ్డు దాటుతుండగా శ్రీకాకుళం వైపు వెళుతున్న బైక్ ఢీకొంది. గాయపడిన ఆయనను చికిత్స నిమిత్తం తొలుత శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి, ఆ తర్వాత విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు..

ఇచ్ఛాపురం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): బెల్లుపడ జాతీయ రహదారి పాత టోల్‌ప్లాజా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం టోల్‌ప్లాజా వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో బిచ్చగాడు మృతిచెందినట్టు స్థానికుల దారాఆ తెలుస్తుందని పట్టణ ఎస్‌ఐ వి.ముకుందరావు తెలిపారు. బెల్లుపడ వీఆర్‌ఓ చాముం డేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కారును ఢీకొన్న ట్రాక్టర్


నుజ్జయిన కారు ముందు భాగం

నరసన్నపేట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలాకి రోడ్డులోని జీసీ హోం వద్ద ఆదివారం కారును ట్రాక్టర్ ఢీకొంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పోలాకి మండలం వెదుళ్లవలస నుంచి నరసన్నపేట వైపు వస్తున్న కారును ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంతో కారులో ఉన్న ఇద్దరికి గాయాలు అయ్యాయి. ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా డ్రైవ్ చేయడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. కాగా దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఏఎస్‌ఐ అసిరినాయుడు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

కవిటి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి కరాపాడు టోల్ ప్లాజా వద్ద అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకున్నట్టు హెచ్‌సీ దుర్గారాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం టోల్‌ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వాహనంలో 14 దున్నపోతులు, రెండు గేదెలను తరలిస్తుండగా వాహనాన్ని నిలుపుదల చేశామన్నారు. డ్రైవర్ రమణయ్య తప్పించుకుని పారిపోతుండగా పట్టుకున్నామని చెప్పారు. పశువులను విజయనగరం జిల్లా అలమండ సంతలో విక్రయిం చేందుకు తీసుకువెళుతున్నామని సదరు వ్యక్తి చెప్పాడని, అయితే ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ఎనిమిది మంది పేకాటరాయుళ్ల అరెస్టు

లావేరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): జీజీవలస కొండ పరిసరాల్లో పేకాట నిర్వహిస్తున్న శిబిరంపై ఆదివారం లావేరు పోలీసులు దాడిచేశారు. పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.15,310 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ జి.లక్ష్మణరావు తెలిపారు. లావేరు, జీజీ వలస, కేశవరాయుపురం గ్రామాలకు చెందిన ఈ ఎనిమిది మందిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

అల్లినగరంలో ఐదుగురు..

ఎచ్చెర్ల, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): అల్లినగరంలో ఆదివారం పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు. వీరి నుంచి రూ.7,560 నగదు, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రణస్థలంలో ఐదుగురు..

రణస్థలం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రణస్థలంలోని పాత పెట్రోల్ బంకు సమీపంలో ఒక తోటలో పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడిచేశారు. తమకు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు శిబిరంపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.61,500 నగదు, 4 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు జేఆర్ పురం ఎస్‌ఐ ఎస్.చిరంజీవి తెలిపారు.

రోడ్లపై చెత్తవేసిన వ్యాపారులకు జరిమానా


అపరాధ రుసుం విధిస్తున్న అధికారులు

టెక్కలి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ టెక్కలిలో రోడ్లపై చెత్తవేస్తున్న వ్యాపారులకు ఆదివారం ఈవో ఏవీ శ్రీనివాస్ జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి దుకాణదారుడు చెత్తడబ్బాను ఏర్పాటు చేసుకోవాలని, కాలువ పలకలపై వ్యాపార సామగ్రి ఉంచరాదని, పారిశుధ్య పనులకు అందరూ సహకరించాలని కోరారు. కాగా సుమారు రూ.50 వేలు వరకు పలువురు వ్యాపారులకు అప రాధ రుసుం వసూలు చేశారు.

తెలగవలసలో విద్యుత్ తీగల చోరీ

నరసన్నపేట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పొలాల్లో ఉన్న పంపుసెట్లకు ఉన్న విద్యుత్ తీగలు చోరీకి పాల్పడే ముఠా శనివారం రాత్రి తెలగవలస గ్రామంలో హల్‌చల్ చేసింది. గ్రామానికి చెందిన ముద్దాడ నాగేశ్వరరావు, గణేశ్వరరావు, సింహాచలం, భాస్కరరావు, ఆడంగి వెంకటరమణలకు చెందిన వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్ స్తంభాలను నుంచి వెళ్లే తీగలను చోరీ చేశారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో జరిగిన ఘటన మళ్లీ పునరావృతం కావడంతో రైతులు గగ్గోలు చెందుతున్నారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయినున్నట్లు రైతులు తెలిపారు.

స్నేహితుడిపై హత్యాయత్నం

- రిమ్స్‌కు తరలింపు
- పరిస్థితి విషమం


గాయపడిన రాజశేఖర్

జి.సిగడాం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఒకే వృత్తి చేసుకుంటూ కలిసి మెలిసి ఉండే స్నేహితుల మధ్య ఏర్పడిన వివాదం మాటమాట పెరిగి హత్యాయత్నానికి దారి తీసిన ఘటన గెడ్డకంచరాంలో ఆదివారం సంభవించింది. పోలీసులు, స్థానికులు తెలిపిన విరాలిలా ఉన్నాయి.. గెడ్డకంచరాం గ్రామానికి చెందిన పుక్కల్ల రాజశేఖర్ ఇదే మండలం గొబ్బూరు గ్రామానికి చెందిన దమరసింగి గొల్లబాబు అలియాస్ శంకర్ మంచి స్నేహితులు. అయితే వీరు మద్యం కోసం గొడవపడి మాటామాట పెరిగి గెడ్డకంచరాం కూడలి వద్ద గొల్లబాబు.. పుక్కల్ల రాజశేఖర్ కడుపులో కత్తితో పొడిచాడు. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని ద్విచక్ర వాహనంపై జి.సిగడాం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తీసుకువెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం 108 వాహనంలో సిబ్బంది సతీష్, మూర్తి శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. రాజశేఖర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. వీరిద్దరూ గృహ, ఇతర నిర్మాణాలకు పెయింటింగ్ వేస్తుంటారు. బాధితుడిని విచారణ చేస్తే గాని పూర్తి వివరాలు తెలియవని పోలీసులు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుసూదనరావు తెలిపారు.

ఆక్రమణలో కంబిరిగాం శ్మశాన భూములు

- చేతులు మారడంతో మౌనం దాల్చిన యంత్రాంగం
- తాత్కాలికంగా పనులు అడ్డుకున్న రెవెన్యూ అధికారులు
- నిరసన తెలుపుతున్న గ్రామస్థులు



ఏర్పాటు చేసిన బోర్డు


కంబిరిగాం భూస్వామికి చెందిన సమాధి


చదునుగా మార్చిన చౌదరీల శ్మశానవాటిక స్థలం

పలాస, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కంబిరిగాం భూవివాదం ఇంకా కొలిక్కి రాకముందే ఆ ప్రాంతంలో మరో వివాదం శ్మశానం రూపంలో చోటు చేసుకుంది. కంబిరిగాం భూ స్వాములకు చెందిన శ్మశానాలను ఆక్రమించి భారీ నిర్మాణాలకు పలాసకు చెందిన ఓ వ్యాపారి దృష్టి సారించడంతో ఆ గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఈ ఏడాది జూన్ 23న కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేసినా పనులు మాత్రం నిలుపుదల కాకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. సర్వే నెంబరు 33/1లో 23 సెంట్ల స్థలాన్ని కంబిరిగాం గ్రామంలో భూ స్వాములుగా ఉన్న చౌదరీలు తమ కుటుంబం కోసం ప్రత్యేకంగా శ్మశానానికి ఈ స్థలాన్ని కేటాయించుకున్నారు. అక్కడే వారి తాత తండ్రుల సమాధులు కూడా కట్టుకొని ఆ ప్రాంతాన్ని దేవాలయంగా కొలుచుకుంటున్నారు. అదే సర్వే నెంబరులో 12.73 ఎకరాల స్థలం వారికి ఉండేది. శ్మశానానికి కేటాయించిన భూమి అందులో మినహాయించగా 12.50 ఎకరాలు ప్రస్తుతం ఉంది. దీన్ని ఇద్దరు పలాసకు చెందిన వ్యాపారులకు విక్రయించారు. ఈ క్రమంలో అందులో ఓ వ్యాపారి శ్మశానంలో ఉన్న సమాధులను జూన్ 23వ తేదీ కూల్చివేస్తుండడంతో ఆ గ్రామ సర్పంచ్ బి.ధనుంజయ్, శివ కుమార్‌తోపాటు గ్రామస్థులు అడ్డుకుని కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ పనులు అక్కడితో నిలిచిపోయాయి. దీనిపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో చౌదిరి కుటుంబ సభ్యులు ఆ భూమిలో తమకు చెందిన శ్మశానం అంటూ బోర్డు పెట్టడంతో ఆ వివాదం అక్కడితో ముగిసింది. అనంతరం ఏమి జరిగిందో తెలియదుగాని.. రెండు రోజుల నుంచి శ్మశానం ప్రాంతంలో మళ్లీ చదును చేసే కార్యక్రమాలు ప్రారంభం కావడంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చౌదరి కుటుంబీకులు కట్టుకున్న మొత్తం శ్మశానాన్ని పూర్తిగా చదును చేశారు. రోడ్డుకు మరోవైపు కొత్తగా శ్మశానం నిర్మించేందుకు చర్యలు తీసుకోవడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఉన్నది పీకి కొత్తగా వేయడం ఏంటని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. శ్మశానం దిశ మార్చడం గ్రామానికి అరిష్టమని గ్రామస్థులు వారిస్తున్నా నిర్మాణం మాత్రం యథేచ్ఛగా సాగుతుండడం విశేషం. ఇదిలా ఉండగా వ్యాపారికి విక్రయించిన భూమిలో కొంతభూమి కొలతల్లో తక్కువ రావడం వల్ల శ్మశానాన్ని ఆక్రమిం చినట్టు ప్రచారం జరుగుతోంది. ఆ ప్రాంతంలో జరుగుతున్న నిర్మాణంపై సంబంధిత వ్యాపారులకు ఎవరు ప్రశ్నించినా అంతా సవ్యంగానే పనులు జరుగుతున్నాయని, తాము కొనుగోలు చేసిన స్థలంలో పనులు చేసుకుంటే తప్పేమి ఉందని ప్రశ్నిస్తుండడం కొసమెరుపు. ఈ వ్యవహారంపై స్థానిక రెవెన్యూ అధికారులు స్పందించి పనులు తాత్కాలికంగా నిలిపివేయాలని కోరడంతో వ్యాపారులు వెనక్కి తగ్గారు. దేవాలయంగా భావించే శ్మశానం, అందులో ఉన్న సమాధులు కూల్చడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి న్యాయం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కోటబొమ్మాళి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, పార్టీ కళింగ వైశ్య సాధికారక సమితి కన్వీనర్ బోయిన గోవిందరాజులు అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి వర్గ సభ్యులు నిరంతరం ప్రజలతో మమేకమై అభివృద్ధి, సంక్షేమాలు అందిస్తున్నారన్నారు. ఇది చూసి ఓర్వలేకనే ప్రతి పక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని అన్నారు. కేంద్రం సాయంతో రాష్ట్రాన్ని చంద్రబాబు అభివృద్ధి చేస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం కేంద్రంతో సఖ్యత లేక అభివృద్ధి కుంటుపడిందని ఈ విషయం ప్రజలు తెలుసుకున్నారన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు రైతాంగం కోసం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కర్రి అప్పారావు, సాసుమహంతి ఆనందరావు, కోరాడ పెద్ద గోవింద, చిన్న గోవింద తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అందించాలి


మాట్లాడుతున్న యూనియన్ నాయకురాలు

కాశీబుగ్గ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఆశ కార్యకర్తలకు క నీస వేతనాలు అమ లు చేయాలని ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.నాగమ ణి డిమాండ్ చేశా రు. ఆదివారం కాశీబుగ్గలో ఆశ యూనియన్ పలాస, వజ్రపుకొత్తూరు మండల మహాసభలు సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మా ట్లాడుతూ.. ఇరవై ఏళ్లుగా ఆశ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో వైద్యాన్ని ప్రజలకు అందిస్తూ అనేక సేవలు అందిస్తూ చాలీచాలని వేతనాలతో నెట్టుకొస్తున్నార న్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. పలాస మండల అధ్యక్ష, కార్యదర్శులుగా హేమలత, జ్యోతి, వజ్రపుకొత్తూరు మండల అధ్యక్ష, కార్యదర్శు లుగా లక్ష్మి, రమణమ్మ మరికొందరు సభ్యులను ఎన్నుకున్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి గణపతి, ద్రౌపతి, లక్ష్మీసరస్వతి తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు


జలుమూరు: రికార్డులు పరిశీలిసున్న విజిలెన్స్ అధికారులు

జలుమూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ డీవీవ సతీష్ కుమార్ హెచ్చరించారు. చల్లవానిపేట కూడలిలోని ఎరువులు షాపులను ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎరువులు, పురుగు మందులు విక్రయాల్లో రైతులకు ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత షాపు యజమానులపై ఉందన్నారు. యూరియాతో పురుగు మందులు, ఇతర ఎరువులు లింకు పెట్టి రైతులకు ఇబ్బంది కలగచేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. కోఆపరేటివ్ అసిస్టెంటు రిజస్ట్రార్ సీహెచ్ ఎర్రన్నాయుడు, వ్యవసాయశాఖ ఏడీ ఎల్‌వీ మధు, వ్యవసాయాధికారి కె.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

- నరసన్నపేట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎరువుల షాపులను విజలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. సీఐ డీవీవీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పలు ఎరువుల షాపులను పరిశీలించారు. యూరియా బ్లాక్ మార్కెట్ తరలించకుండా ఒక్కొక్క రైతుకు ఒకటి లేదా రెండు యూరియా బస్తాలు ఇవ్వాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చిరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజస్ట్రార్ యర్రన్నాయుడు, ఏడీఏ ఎల్‌వీ ముధు, ఏవో సూర్యకుమారి తదితరులు పరిశీలించారు.

శ్రీకాకుళం జిల్లాలోనే కొనసాగించాలి


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరావు

ఎల్ఎన్ పేట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): తమ మండలాన్ని శ్రీకాకుళం జిల్లాలోనే కొనసాగించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎల్ఎన్ పేట మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కోరుతున్నారు. ఈ మేరకు మోదుగవలస జంక్షన్‌లో ఆదివారం వారంతా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మండలాన్ని టెక్కలి రెవెన్యూ డివిజన్ నుంచి శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్‌లోకి మార్పు చేయాలని, కొత్తగా పలాస జిల్లా ఏర్పాటు చేస్తారన్న ఊహాగానాలు వస్తున్నందున, ఎన్ఎన్ పేట మండలాన్ని శ్రీకాకుళం జిల్లాలోనే కొనసాగించేలా తీర్మానం చేసి సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు అందిస్తామన్నారు. రాజకీయంతో సంబంధం లేకుండా మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులందరూ ఐకమత్యంగా మండలాన్ని శ్రీకాకుళం జిల్లాలో ఉండేందుకు పనిచేసేందుకు నిర్ణయించామన్నారు. సమావేశంలో వంశధార ప్రాజెక్టు జిల్లా నీటి సం ఘం అధ్యక్షుడు వి.ఆనందరావు, వివిధ పార్టీల నాయకులు ఎం.మనోహర్ నాయుడు, కె.చిరంజీవి, పి.విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సందడి


ఒకే చోట చేరిన పూర్వ విద్యార్థులు

పాతపట్నం ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): తెంబూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా ఆదివారం 2001-02 పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. సుమారు 60మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలు నెమరువేసుకొన్నారు. తెంబూరు, పెద్దలక్ష్మీపురం సర్పంచ్‌లు బెనియా వెంకట రమణ, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొని ఆ నాటి ఉపాధ్యాయులను సత్కరించారు. నాటి బ్యాచ్‌కు చెందిన హిరమండం ఎంఈవో కె.రాంబాబు, ఉపాధ్యాయులు రామచంద్రరావు, డిగ్రీ కళాశాల అధ్యాపకులు వాసుదేవరావు, ఈశ్వరమ్మ తదితరులు పర్యవేక్షించారు.

మట్టి వినాయకులను పూజిద్దాం


మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

హిరమండలం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి) మట్టిగణపతిలనే పూజించి పర్యావరణాన్న కాపాడాలని హిరమండం మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు తూలుగు తిరపతిరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక చిన్నకోరాడ జంక్షన్ మట్టిగణపతి విగ్రహాలను, వ్రత పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దారపు ఢిల్లేశ్వరావు, శ్రీధర్, లాడి కృష్ణారావు, షాహుకారి గోవింద, కామేశ్వరావు,తదితరలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకరించాలి

కొత్తూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మెట్టూరు బిట్-1 పరిధిలో నిర్మిస్తున్న ఆలయానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ శంకరావు కోరారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించి కడుతున్నట్టు కొంతమంది ఆరోపణలు చేస్తూ అడ్డంకులు చేస్తున్నారని, ఇది బావ్యం కాదన్నారు. ఆలయ నిర్మాణం కోసం ప్రజలు విరాళాలు సేకరించి స్వచ్ఛందంగా నిర్మాణం చేస్తున్నారే తప్ప ఎవరి సొంతంకోసం కాదన్నారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు దారుణం

ఆమదాలవలస, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే రవి కుమార్‌పై లోలుగు కేజీబీవీ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన సౌమ్య ఆరోపణలు చేయడం దారుణమని టీడీపీ జిల్లా కార్యదర్శి, కనుగులవలస సర్పంచ్ నూక అప్పలనూరానాయుడు (రాజు) అన్నారు. ఆదివారం ఆయన కనుగులవలసలో విలేకరులతో మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఉద్యోగులపై వచ్చే ఆరోపణలు సహజమని, వాటిపై జిల్లా అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటారని, వాటిలో భాగంగా ఆమెను బదిలీ చేశారన్నారు. అయితే ఆమె వైసీపీ నేతల కుట్రలో ఆమె నిజాయతీ కలిగిన ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం సమంజసంకాదన్నారు. ఇప్పటికైనా ఆమె ఆరోపణలను విరమించుకోవాలని హితవు పలికారు. బీజేపీ నాయకుడు బెండి రవికాంత్, కూటమి నేతలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

పోలాకి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు జరుగుతుందని వ్యవసాయాధికారి చిరంజీవి తెలిపారు. ఆదివారం మబగాంలో లక్ష్మణదాస్ పొలంలో ప్రకృతి వ్యవసాయ సాగుపై వరినారు చిగురు తుంచి లైన్‌ఫోయింగ్ పద్ధతిలో వరినాట్లు వేయించారు. వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

బస్సును పునరుద్ధరించండి

కొత్తూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామమైన అంగూరుకి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని సుమారు 12 గ్రామాల ప్రజలు కోరుతున్నారు. మండల కేంద్రాని సుమారు 15 కిలోమీటర్ల దూరంగా ఉండడం, వివిధ పనులపై ప్రజలు రావాలంటే ఇబ్బందిపడుతున్నారన్నారు. ఆటోలపై వస్తే రానుపోను రూ.60 అవుతుందని, ఇది నిరుపేదలకు ఆర్థిక భారం అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంగూరు, ఆకులతంపర, సోమరాజపురం, శోభనాపురం, మదనాపురం, ఆర్కెపురం, గురండి, పాతపాడు, వెంకటాపురం, జోగిపాడు, బమ్మిడి, కలిగాం గ్రామాల ప్రజలు బస్సు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు

నేడు పాలక మండలి ప్రమాణం

నరసన్నపేట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక వేంకటేశ్వర స్వామి దేవస్థానం పాలకమండలి ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆదివారం ఒక ప్రకటలో తెలిపారు. ఆలయ పాలక మండలి చైర్మన్‌గా వంశపారంపర ధర్మకర్త పొట్నూరు చిన్నవీరభద్రస్వామి, సభ్యులుగా మావుడూరి జగదీష్, బోయన శ్రీదేవి, కూన గాయిత్రి, దంతకూర్తి బాలకృష్ణ, లక్కోజి విశ్వనాథం, దుప్పలపూడి పద్మ, యారాగుల సుశీలను దేవదాయశాఖ కమిషనర్ నియమించినట్లు తెలిపారు.

నేడు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

జలుమూరు (సారవకోట), ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): నూతనంగా వచ్చిన స్మార్ట్ రేషన్ కార్డులు లబ్ధిదారులకు అందించనున్నట్టు పౌరసరఫరాల డీటీ షరీఫ్ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో స్మార్టు రేషను కార్డులు సంబంధిత డిపో డీలర్లకు ఆదివారం అందించారు. జలుమూరు మండలానికి 18,582 స్మార్టు కార్డులు సారవకోట మండలానికి 15,983 స్మార్టు రేషను కార్డులు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.

తేనె టీగలు పెంపకంపై శిక్షణ

నందిగాం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వెలుగు కార్యాలయంలో ఆదివారం తేనెటీగల పెంపకంపై మహిళా రైతులకు ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన హంబుల్‌బీ సంస్థ ఆధ్వర్యంలో ఈ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వివరించారు. కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, వీవోఏలు, సీసీలు ఉన్నారు.

సర్వేకు ప్రజలు సహకరించాలి

పోలాకి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇంటింటా ప్రతిష్టాత్మకంగా సచివాలయ సిబ్బందిచే నిర్వహించనున్న స్వామిత్వ సర్వేకు ప్రజలు సహకరించాలని దీర్ఘాశి సచివాలయ కార్యదర్శి జగదీష్, వీఆర్‌వో బోర జగన్నాథం తెలిపారు. ఆదివారం సచివాలయ సిబ్బంది కొయ్యాన, నూక, కంచరి వీధుల్లో ఇంటింటా సర్వే నిర్వహించారు. ఇళ్ల కొలతలను చేపట్టారు. ఆధార్, కుటుంబసభ్యుల వివరాలు, రేషన్‌కార్డు, పల్లం, మెట్టుభూమి, యజమాని వివరాలు సేకరిస్తున్నారు. వారి వెంట వెల్ఫేర్ అసిస్టెంట్, ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్ ఉన్నారు.

పాఠశాలల్లో చేర్పించండి

వజ్రపుకొత్తూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లల ను పాఠశాలల్లో చేర్పించాలని నగరంపల్లి హైస్కూల్ హెచ్‌ఎం టి.హేమారావు అన్నారు. పాఠశాలకు సరిగా రాని విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి వారిని మళ్లీ పాఠశాలకు వచ్చేలా ఆదివారం నువ్వలరేవు గ్రామంలో పలువురి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు కొయ్యిల శ్రీనివాసరావు ఎస్ఎంసీ చైర్మన్ బి.లక్ష్మిపతి ఉన్నారు

ఆర్థిక ఇబ్బందులతో.. 'చితికి'పోయి..

(ఐదో పేజీ తరువాయి)

భారం లలితపై పడింది. ప్రతిరోజూ కూలికి వెళ్లి కుటుంబాన్ని పోషించుకునేది. కుటుంబ అవసరాల కోసం కొంత డబ్బులు అప్పు చేసింది. ఇటీవల వృద్ధురాలైన అప్పారావు తల్లి మృతి చెందింది. దీంతో ఉమ్మడి ఆస్తిగా ఉన్న ఇంటిని ఖాళీ చేయాలని అన్నదమ్ముల నుంచి అప్పారావుపై ఒత్తిడి వచ్చింది. ఒకపక్క ఆర్థిక ఇబ్బందులు, మరోపక్క ఇతర సమస్యలు ఆ కుటుంబాన్ని తీవ్రంగా కుంగదీశాయి. దీంతో ఆత్మహత్య చేసుకోవాలని అప్పారావు, లలిత, దేవి నిర్ణయించుకున్నారు. శనివారం రాత్రి వారు ఇరు గుపొరుగువారితో కబుర్లు చెప్పుకుంటూ, భోజనానికి వేళ అయిందని ఇంట్లోకి వెళ్లిపోయారు. అనంతరం ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆదివారం తెల్లవారుజామున వారి ఇంట్లోకి స్థానికులు వెళ్లిచూడగా అప్పారావు, లలిత విగతజీవులుగా పడిఉన్నారు. కుమార్తె దేవి అపస్మారక స్థితిలో కనిపించింది. దేవిని హుటాహుటిన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (రిమ్స్)కి తరలించారు. విషయం తెలుసుకున్న సీఐ పైడపునాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలకు పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

నేనేమి సాధిస్తానని..

శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దేవిని పోలీసులు విచారించగా.. 'ఎలుకల మందు తాగినట్లు తల్లిదండ్రులు నాతో చెప్పారు. నేను ఒక్కదాన్ని ఉండి ఏమి సాధిస్తానని మిగిలి ఉన్న ఎలుకల మందు తాగాను' అని తెలిపింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన దంపతులు ఆత్మహత్య చేసుకోవడంతో అంపోలులో విషాదఛాయలు అలముకున్నాయి.

ఆస్తి వివాదమే కారణం

- పింఛన్ సమస్యతో సంబంధం లేదు
- అధికారుల నివేదిక స్పష్టం

శ్రీకాకుళం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): అంపోలులో చోటుచేసుకున్న దంపతుల ఆత్మహత్య ఘటనకు ఆస్తి వివాదమే కారణమని కలెక్టరేట్ నుంచి ప్రత్యేక ప్రకటన ఆదివారం రాత్రి వెలువడింది. పింఛన్ నిలిపేయడంతో వారు ఆత్మహత్య చేసుకున్నట్టు సామాజిక మాధ్యమాల్లో చేస్తున్న ప్రచారం అసత్యమని అందులో స్పష్టం చేశారు. గార తహసీల్దార్ విచారణ ప్రకారం.. అంపోలులో దంపతుల ఆత్మహత్యకు పింఛన్ సమస్యకు సంబంధం లేదని నిర్ధారణ అయ్యింది. గ్రామస్థుల వాంగ్మూలాల ప్రకారం.. కుటుంబ అంతర్గత ఆస్తి, ఇల్లు సంబంధిత వివాదాలే ఈ విషాదానికి ప్రధాన కారణమని నిర్ధారించారు. ఇదే అంశంపై శ్రీకాకుళం ఆర్డీఓ కూడా ఆదివారం విచారణ చేసి నివేదిక సమర్పించారు. అప్పారావు కుమార్తె దేవి పోలీసులకు ఇచ్చిన సమాచారంలో కూడా కుటుంబ ఆస్తి వివాదమే కారణమని పేర్కొన్నారు.